بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# హుజూరె అన్వర్ ఖుత్బా జుమా సారాంశము

**దివి: 07.03.2014** **నజారత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్ తరపున**

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరము హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

ఇంగ్లాండ్‌లో జమాఅత్‌కు వంద సం॥లు పూర్తయిన సందర్భముగా అహ్మదియ్య జమాఅత్ ఇంగ్లాండ్ గత మూడు వారాల క్రితం ఒక వేడుకను నిర్వహించెను. ఇందులో తమ తమ పవిత్ర గ్రంధము ఆధారముగా దేవుడు, ధర్మ భావన బోధను, 21వ శతాబ్దములో దైవ పాత్ర, దేవుని అవసరమును ప్రవేశపెట్టుటకు వివిధ ధర్మముల పండితులు, ప్రతినిధులకు ఆహ్వానము పంపెను. ఇస్లాం వైపున ప్రాతినిధ్యము జమాఅత్ వహించవలసి యుండెను. ఇంకా యూద, క్రైస్తవ, బౌద్ధమతము, దరూజీ, హిందూ మతము, జర్తష్తి, సిక్కు మతము, బహాయి తరపున కూడ ప్రతినిధులు వచ్చియుండిరి. తమ అభిప్రాయాలు తెలుపుటకు వీరితో పాటు పలు రాజకీయ, మానవ హక్కుల సంఘ ప్రతినిధులకు కూడ అవకాశమివ్వబడెను. ఈ మహోత్సవము ఇక్కడ ప్రాచీన, సంప్రదాయ Guildhall హాల్లో జరిగినది. ఈ వేడుక గురించి వివరించుట ఇప్పుడు నా ఉద్దేశము. ప్రజలు ఖుత్బా ఎక్కువ వింటారనే ఆలోచనతో ఖుత్బాలో సంక్షిప్తముగా ప్రస్తావించెదను. కాని ఎమ్.టి.ఏలో అది ప్రసారమైనప్పుడు వీక్షించుట చాలా మంచిది. ఎందుకనగా ఇదొక సంపూర్ణమైన వేడుక. వక్తల వ్యాఖ్యానముల సారాంశము ఇప్పుడు తెలిపెదను.

ఇక్కడ వున్న ఒక **హిందూ కౌన్సిల్ చైర్మన్ ఉమేష్ చంద్ర** గారిట్లనిరి. నేటి శీర్షిక చాలా ఆసక్తికరమైనది. దేవుదున్నాడను విషయముతో మనందరము ఏకీభవించినట్లు ఋజువైనది. రెండవ విషయము ప్రపంచములో శాంతి స్థాపన గూర్చి రాజకీయ నాయకులు, ఇతర వ్యవస్థలు సఫలం కాలేదని కూడ స్పష్టమైనది. నలు వైపుల పీడనము, అశాంతి రాజ్యమేలుచున్నది. రాజకీయ నాయకులపై ప్రజల నమ్మకము సడలిపోయెను. మానవజాతి శ్రేయస్సు కొరకు మరల ధర్మము వైపు దృష్టి సారించవలసిన సమయమాసన్నమైనదని నా అభిప్రాయము. తర్వాత ఇక్కడ లండన్‌లో నున్న **బౌద్ధమత నాయకులు దలైలామా** ప్రతినిధిగా వారి సందేశము ఇట్లు చదివిరి. 11.2.2014 తేదీన అహ్మదియ్య జమాఅత్ తరపున సర్వధర్మ సమ్మేళనము నిర్వహించు సాహసోపేత కృషిని నేను ప్రోత్సహించుచున్నాను. ఇటువంటి సభలు మంచి ఫలితాలకు కారణమగునని నా నమ్మకము. **దరూజీ కమ్యూనిటి నాయకులు షేఖ్ మువఫ్ఫిఖ్ గారు** ఇట్లనిరి. అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ నన్ను ఈ కాన్ఫరెన్స్‌కు ఆహ్వానించినందుకు ఋణపడివున్నాను. ఇంగ్లాండ్‌లో జమాఅత్‌కు వంద సం॥లు పూర్తయిన సందర్భమున ఈ అద్భుత కాన్ఫరెన్స్ నిర్వహించినందుకు నేను శుభాకాంక్షలు తెలుపుచున్నాను. పాలస్తీనాలో మాకు అహ్మదియ్యా జమాఅత్‌తో స్నేహ పూర్వక సంబంధాలు గలవు. మీ తరపున ఆహ్వానమందినందుకు మాకు ఆనందము కలిగెను. రండి! మనందరము కలిసి హింస, క్రూరమును ఖండించెదము. తూర్పులోనే కాదు ప్రపంచవ్యాప్తముగా ప్రేమ చెలిమలు ప్రవహించు విత్తనములను నాటెదము. **కేథలిక్ చర్చ్ బిషప్ కేమన్ మిక్‌డొనల్డ్** ఇట్లనిరి. ఈ సర్వధర్మ సమ్మేళనములో పాల్గొని, కేథలిక్ చర్చ్ ప్రాతినిధ్యములో ప్రసంగించినందుకు నాకు ఆనందము కలుగుచున్నది. నేడు ప్రపంచానికి ఇటువంటి సమ్మేళనముల అవసరము ఎంతో వుంది. ఆ తర్వాత **పోప్ కేబినెట్ ప్రెజిడెంట్ గౌ॥ కార్డినల్ పీటర్ టక్సన్** సందేశమును వారు చదివి వినిపించిరి.

పలు రాజకీయుల సందేశములు, ఉపన్యాసములు కూడ యుండెను. **ఘానా అధ్యక్షుని** సందేశము వారి హై కమీష్నర్ చదివి వినిపించిరి. ఇక్కడి **బేరూనస్ సయీద వాట్సీ** గారు పాల్గొని ఇట్లనిరి. ఈ గొప్ప హాల్‌లో సర్వధర్మ సమ్మేళనములో కూడిన గౌ॥ అతిథుల ముందు నా అభిప్రాయాలు తెలుపుట నాకు గౌరవ కారణం. ఈ కాన్ఫరెన్స్ అహ్మదియ్య జమాఅత్ ధైర్యము, విశాల హృదయము, దూరదృష్టి, గొప్ప ఆలోచనకు దర్పణం. మీరు అంతర్జాతీయ స్థాయి గల ఈ సమావేశము ఏర్పాటు చేసి తమ అభిప్రాయాలే కాక ఇతర ధర్మ ప్రతినిధుల అభిప్రాయాలను తెలుపుటకు ఆహ్వానించిరి. మానవత్వము ఉద్దేశముతోనే అహ్మదియ్య జమాఅత్ చేసిన సేవలు మొత్తం ఇంగ్లాండ్‌లో మనకు కనిపించును. ప్రపంచ ధర్మములన్ని ఏకమై మతాల మధ్య ఏకాభిప్రాయ సాధన దిశగా కృషి చేయుటకు సిద్ధమను విషయము ఈ సమావేశ సఫలముతో నిరూపితమైనది. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనుట నాకొక సన్మానము.

**కమీషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్ ఆఫ్ అమెరికా వైస్ చైర్మన్ డా॥ కెట్రినా**కు జమాఅత్‌తో చిరకాల సంబంధము గలదు. వీరిట్లనిరి. మీతో కలిసి పాల్గొన్నందుకు నాకు చాలా ఆనందము కలుగుతుంది. ఇది నాకు గర్వ కారణము. మీ జమాఅత్‌కు ఇంగ్లాండ్‌లో వంద సం॥లు పూర్తయినందున జరగుచున్న ఈ వేడుకలో నేను హాజరైనాను. నేటి ఈ వేడుక పరస్పర సోదరభావ, మత సామరస్య ఉన్నత విలువలకు ప్రతీక. ఈ లక్షణములే మీ జమాఅత్ ప్రాథమిక సూత్రాలు. ఇంగ్లాండ్ ప్రధాన మంత్రి సందేశమును ఇక్కడి **అటార్ని జనరల్ రైట్ ఆనరేబుల్ డామింక్ క్రో** వినిపించే ముందు ఇట్లు మాట్లాడిరి. నేటి ఈ సభ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. ఒక అధర్మ వ్యక్తి కంటే ధర్మమును పాటించే వ్యక్తి ఇతర ధర్మములను విశ్వసించే వారి మనోభావాలను మంచిగా గ్రహించగలడని ఒక క్రైస్తవునిగా నా అనుభవము. **ప్రధాన మంత్రి తన సందేశములో ఇట్లనిరి.** ఇంగ్లాండ్‌లో అహ్మదియ్య జమాఅత్ మానవ సేవలను నేను ప్రశంసించెదను. మీరు ఒక వైపు దేశమంతటా సర్వధర్మ సమ్మేళనములు నిర్వహించుచు రెండవ వైపు గత వరద బాధితులను ఆదరించిరి. (అల్లాహ్ కృపానుసారము ఖుద్దాముల్ అహ్మదియ్య ఇందులో గొప్పగా పనిచేసెను) మతాల మధ్య సత్సబంధాల ఏర్పాటుకు, ప్రపంచ శాంతి కొరకు మీరు చేయుచున్న కృషికి నేటి ఈ సమావేశమే సాక్ష్యము. ఈ సమావేశములో ఇంగ్లాండ్ ప్రభుత్వ ప్రతినిధి పాల్గొన్నందుకు నాకు సంతోషము కలుగుతుంది. అహ్మదియ్య జమాఅత్ ఇమామ్, ఇతర ధర్మ ప్రతినిధులు, అతిథులతో కలిసి వివిధ ధర్మముల వారు పరస్పర సహకారముతో ప్రపంచములో శాంతి ఎలా ఏర్పాటు కావలెనో, మేమెలా కృషి చేయగలమో గ్రహించెదము. **చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్ నాయకురాలి ప్రైవేట్ సెక్రటరి** ఇట్లు వ్రాసిరి. అహ్మదియ్య జమాఅత్ ఇంగ్లాండ్ తన స్వర్ణోత్సవ సందర్భమున Guildhall లో నిర్వహించు గొప్ప సర్వధర్మ సమ్మేళనపు సందేశము ఇంగ్లాండ్ రాణికి అందుట సంతోషదాయకం. ఈ సభ లక్ష్యాలు తెలుసుకొని గౌ॥ రాణి ఆనందం వ్యక్తం చేసిరి. మీరు ఆహ్వాన పత్రము పంపినందుకు వారు ఋణపడి వున్నారు. ఈ సభ విజయవంతము, చరిత్రాత్మకము కావలెనని గౌ॥ రాణి అభిలాష.

ఇతరుల అభిప్రాయాలు ఇట్లుండగా అక్కడ నేను చెప్పిన దాని సారాంశము ఇట్లు గలదు. మానవుల సంస్కరణ జరిగి, మానవుడు అల్లాహ్, అతని సృష్టి హక్కును చెల్లించుటకు అల్లాహ్ కోరును. ఈ లక్ష్యమునకే అల్లాహ్ ప్రవక్తలను పంపును. ప్రవక్తల మాటలను విశ్వసించిన వారు సఫలమవగా నిరాకరించిన వారు విఫలమైరి. ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను మొత్తం ప్రపంచ సవరణకు అల్లాహ్ పంపినప్పుడు వారు సర్వశక్తులా ప్రచారము చేసినారు. ప్రచారముతో పాటు ఫలితములు సాధించుటకు ప్రజల హృదయాలు, మనస్సుల మార్పుకు

సాష్టాంగ స్థలము కన్నీటితో తడిచిపోయేటట్లు ప్రార్థనలు చేసేవారు. మానవుని, సంస్కరణ, వినాశనము నుండి రక్షించు వర్ణనాతీతమైన బాధ వారి హృదయములో యుండెను. ప్రతి దుష్కార్యములో మునిగి నున్న వారిని దుష్కార్యముల నుండి దూరము చేసి సత్ప్రవర్తన గల, అల్లాహ్‌తో సంబంధమేర్పరచుకున్న వారిగా చేసిరి. ఈ మార్పు ఏ ప్రపంచ శక్తికి సాధ్యమైనది కాదు. ప్రార్థనలను విను, హృదయాల యజమాని అయిన అల్లాహ్ కార్యమిది.

శత్రువులతో సత్ప్రవర్తన గల ప్రపంచములో ఎక్కడా లభించని ఉదాహరణలు వారు సల్లల్లాహు అలైహి వసల్లం నెలకొల్పిరి. మక్కాలో వారి (స.అ.స) తో బద్ధ శత్రుత్వము నెరపిన వారిని మక్కా విజయ సందర్భమున వారు ఏ తప్పు, దుష్టత్వమునకు పాల్పడనట్లు క్షమించిరి. ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కఠినము, యుద్ధము గూర్చి నిందించుట లేదా నేడు కూడఈ ప్రపంచములో నిందించడం జరుగుచున్నది, ఇది చరిత్ర వాస్తవాలు తెలియని ఫలితము. ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏనాడు మొదలు యుద్ధము చేయలేదు. నేను, అహ్మదియ్య జమాఅత్ నమ్ముచున్నదేమనగా అహ్మదియ్య సంఘ స్థాపకులు మసీహ్ మౌవూద్ రూపములో అవతరించిరి. తనను నమ్మువారిలో నిజమైన ఇస్లాంను జారీ చేసిరి. స్వచ్ఛమైన ఇస్లాంను అనుసరించుచున్న, అనుసరించుటకు కృషి చేయుచున్న ఒక జమాఅత్‌ను స్థాపించిరి. నేనింకా ఇట్లు తెలిపితిని. ఇస్లాం పునరుజ్జీవమునకు వచ్చిన మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో కూడ అల్లాహ్ సహాయ సహకారాలు గలవు. అల్లాహ్ మాటలు కథలు మాత్రమే కాదు, అల్లాహ్ ఇప్పటికీ సజీవముగా నున్నాడు, తన దాసులతో మాట్లాడును, చిహ్నము చూపునను భావన మాకు అహ్మదియ్య సంఘ స్థాపకులు కల్పించిరి. కనుక ప్రపంచము ఇటు వైపు శ్రద్ధ వహించవలెను, తన తప్పిదములకు అల్లాహ్, ధర్మమును నిందించే బదులు ఆత్మ పరిశీలన చేసుకొవలెను. దీనిని ఆచరించు అనుగ్రహము అల్లాహ్ ప్రపంచానికి కల్గించు గాక!

సమావేశములో పాల్గొన్న వారి అభిప్రాయాలను హుజూర్ పుర్‌నూర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు తెలిపిరి. **Stein Villumstad యూరోపియన్ కౌన్సిల్ ఫర్ రిలీజియస్ లీడర్స్ జనరల్ సెక్రెటరి** ఇట్లనిరి. ఇటుల ఐక్యముగా కూర్చొని, వివిధ ధర్మముల అనుచరులు ఒకరు మరొకరి మాటను ఆసక్తిగా వినుట, మేమెందరము శాంతిని కోరుచున్నామని అంగీకరించుట ఒక పెద్ద విజయము. **ఇంగ్లాండ్‌లో గ్రీనిడా హై కమీష్నర్ HE Joselyn Whiteman** ఇట్లనిరి. ఇదొక గొప్ప వేడుక. ఇన్ని ధర్మములు ఒకే కప్పు క్రింద సమావేశమగుట మా విశ్వాసమును పెంపొందించుటకు కారణమయ్యెను. ప్రపంచ సమస్యల కొరకు ప్రజలను ఎలా సమావేశపర్చవచ్చునో మాకు దీనితో అంచనా కలిగెను. **లండన్‌లో మెట్రో పాలిటన్ పోలీస్ కమాండర్ అయిన Mak Chishty** గారిట్లనిరి. ప్రతి ఒక్కరు తన ధర్మ విశిష్టతలను నేటి సమావేశములో వివరించిరి, కాని ఇతర ధర్మమును నిందించనందుకు నాకు ఆనందము కలిగినది. దీనితోనే మనలో పరస్పరం ఐక్యతా భావము కలుగును. ఇట్లు జరగవలెనని ఈ విషయమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం రాణికి వ్రాసియుండిరి. యూరోపియన్ పార్లమెంట్‌లో లండన్ ప్రతినిధి **Dr. Charles Tannock MEP** ఇట్లనిరి. భవిష్యత్తులో ఈ దారిని అనుసరించక తప్పదు. మనందరము దేవున్ని నమ్ముచు మతము పేరున మనము పర్సపరం ఇట్లు జగడమాడుట దేవుని కోరిక అని మనము నమ్మలేము. కావున ఈ శాంతి సందేశమును నేను గట్టిగా సమర్థించుచున్నాను. వీరి ధర్మ బోధల కేంద్రము "అందిరిని ప్రేమించు ఎవ్వరిని ద్వేషించక"ను సందేశము వలన నేను అహ్మదీయులను గౌరవింతును. నా దృష్టిలో ఇది అంతర్జాతీయ స్థాయి సందేశము. వివిధ ధర్మములు ఎంత ఐక్యముగా నుండునో అంతే ఉత్తతమము.

ఇంగ్లాండ్ ఆల్ పార్టీ పార్లమెంటరీ గ్రూప్ ఆన్ ఇంటర్నేషనల్ ఫ్రీడమ్ ఆఫ్ రిలీజియన్ చైర్‌పర్సన్ **Baroness Berridge** ఇట్లనిరి. మతసామరస్యమునకు ఆల్ పార్టీ గ్రూప్ చైర్మన్ అగు గౌరవము నాకు గలదు. ఇతరుల ప్రగతి, అభివృద్ధి కొరకు అహ్మదియ్య కమ్యూనిటి ఏ విధంగా కృషి చేయుచున్నదో నాకు తెలుసు. ఈ విషయమును అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ కూడ తన ప్రసంగములో తెలిపిరి. మేము అహ్మదియ్య కమ్యూనిటితో కలిసి ఈ పనులలో సహాయము చేయుచున్నందుకు మాకు సంతోషము గలదు. అహ్మదీయులకు ఈ దేశములో పూర్తి మత స్వేచ్ఛ వున్నందున కూడ మాకు ఆనందము గలదు. ఇంగ్లాండ్ ఆల్ పార్టీ పార్లమెంటరీ గ్రూప్ ఆన్ ఇంటర్నేషనల్ ఫ్రీడమ్ ఆఫ్ రిలీజియన్ మెంబర్ **Kay Carter** ఇట్లనిరి. ప్రేమ, సామరస్యము, శాంతి అన్ని మతాలలో ప్రాథమిక విషయమని అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ అనిరి. మతమును మానవులలో కలహాలు పుట్టించు ఒక సాధన అను రీతిలో మీడియాలో ప్రవేశపెట్టబడెను. కాని నేటి ఈ సమావేశములో మనము చూసినట్లు వాస్తవము ఇందుకు విరుద్ధముగా నున్నది. ఈ చీఫ్‌గారే మరల ఒక ఉత్తరము ద్వారా ఇట్లు సందేశము పంపిరి. శాంతి, ఒకరినొకరు అర్థం చేసుకునే విధంగా అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ సందేశముండెను. సర్వ ధర్మముల వారు పరస్పరం అభిప్రాయాలను పంచుకోవలెను. ఎందుకనగా మనందరము ఆదమ్ సంతతి, దేవుని సృష్టి. పరస్పరం భావాలను గౌరవించవలెను. శాంతి, ఐక్యతతో వుండవలెను. మనము ఒకరితో మరొకరు జగడమాడే బదులు శాంతి కొరకు ప్రయత్నించవలెను. **సంతోఖ్ సింగ్ కౌన్సిలర్** గారిట్లనిరి. అన్ని ధార్మాలలో ఒకే రకమైన విద్యలు కలవని అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ మనకు తెలుపుచున్నారని నా అభిప్రాయము. ప్రపంచ ధర్మములన్ని మానవత్వమునే మనకు నేర్పును. కలిసి మెలిసి పని చేయుచు పరస్పర ప్రయోజనము కొరకు కృషి చేయవలెను. **నార్వే లోని ఒక రాజకీయ పార్టి Billy Tranger, Christian Republic** వారిట్లనిరి. అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ తన ప్రసంగము చివరలో మనందరము కలిసి శాంతి కొరకు కృషి చేయవలెనని ఒక ముఖ్యమైన సందేశమిచ్చిరి. ఈ విషయము నేడు ప్రపంచములో, నార్వేలో కూడ అత్యవసరమైనది. **యూనివర్సిటి ఆఫ్ ఏమిస్టర్‌డమ్ ప్రొఫెసర్ Prof. Dr. T. Sunier** ఇట్లనిరి. ఇస్లాం, ఖురాన్ బోధలు కఠినత్వము గాక శాంతి స్థాపనను బోధించునని అహ్మదియ్య ముస్లిం జమాఅత్ ఇమామ్ స్పష్టముగా నిరూపించిరి. మరల **Greek Orthodox Patriarch of Antioch సంబంధించిన Father Ethekwine** ఇట్లనిరి. నేను అహ్మదియ్య జమాఅత్ వివిధ వేడుకలలో పాల్గొన్నాను. ఇమామ్ జమాఅత్ వ్యక్తిత్వాన్ని, వారి సందేశమును హృదయపూర్వకంగా ప్రశంసించుచున్నాను. ఎప్పటిలాగే ఈ కాన్ఫరెన్స్‌లో ఉత్తమ ఉపన్యాసము ఖలీఫా గారిదే యుండెను. వివిధ ధర్మముల వారిని ఏకపరచుట, వారితో వారి ధర్మ విషయమును వినుట ధైర్యముతో కూడిన చర్య. ఇదొక గొప్ప విజయము.

**ఐర్లాండ్** నుండి వచ్చిన వారొకరు ఇట్లనిరి. ఈ కాన్ఫరెన్స్‌లో నేను పాల్గొంటిని. ఇక్కడ నాకు లభించిన సందేశము నన్ను కదిలించెను. ప్రచారము లేనిదే తన సందేశమును వ్యాపించుట నేడు ప్రపంచములో చాలా కష్టమని నేను అహ్మదీయులతో అనదలచితిని. అహ్మదియ్య జమాఅత్ ఇంత కృషి చేయుచున్నది. మీరు మీ కార్యములకు ప్రచారము కల్పించినచో నాకు సంతోషము కలుగును. ఎందుకనగా ప్రపంచములోని కొద్ది మందికి మాత్రమే మీరు తెలుసు. **యూరోపియన్ కౌన్సిల్ ఆఫ్ రిలీజియస్ లీడర్స్‌కు చెందిన జహంగీర్ సారౌ** గారిట్లనిరి. నేను ధార్మికంగా జర్తిష్టిని. ఈ వేడుకతో నేను చాలా ప్రభావితమైనాను. ఉపన్యాసకులందరు మంచిగానే ప్రసంగించిరి. కాని చివరలో అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ ఉపన్యాసము ఉత్తమమైనది. **ధార్మిక విద్యల**

**ఉపాధ్యాయుడు రాబిన్ హస్సీ** ఇట్లనిరి. ఈ వేడుక ఇంతటి ఆధ్యాత్మికతతో నిండివుండునని నాకు తెలియదు. నేను అనేక ధర్మముల సందేశాలను విన్నాను. ఇంటికి చేరి ఈ విషయములపై నేను గ్రహించెదను. అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ లెక్చర్ పాఠము త్వరలో ముద్రించబడునని నేను ఆశించుచున్నాను. ఒక కేథిడ్రల్‌కు చెందిన **Canon Dr. Cane** ఇట్లనిరి. కొంత కాలము మాకు ధర్మము అవసరం లేదని ప్రజలు ఊహించసాగిరి. ఇది నిరాధారమైనట్లు నిరూపితమైనదని నా అభిప్రాయము. మరల బెల్జియమ్ యూనివర్సిటి **Anwerpo** నుండి ఇద్దరు డాక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొనిరి. **Dr. Lydia** ఇట్లనిరి. ఇస్లాం, రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం స్వచ్ఛమైన విద్యల గూర్చి అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ ఉపన్యాసముతో వారు చాలా ప్రభావితమైరి. ఉపన్యాసము విన్న తర్వాత ఖురాన్ చదివి, ఇస్లాం నిజమైన బోధలను తెలుసుకొనుటకు యూనివర్సిటిలో మా విద్యార్థులకు ఖురాన్ ఫ్లేమిష్ అనువాదము ఇవ్వవలెనని నిర్ణయించుకున్నాము. వారికి అనువాదము ఇవ్వడబడెను. యూనివర్సిటిలో వారు పంచుచున్నారు కూడ. అల్లాహ్ కృపానుసారము దీనితో ప్రచారముకు నూతన ద్వారములు తెరుచుకున్నవి.

**SANTIAGO CATALA RUBIO** (సున్నతిఆగో కతాల రూబియో) గారు స్పెయిన్ నుండి వచ్చిరి. మెడ్వర్గ్ యూనివర్సిటిలో రిలీజియస్ ప్రొఫెసర్ అయిన వీరు అనేక పుస్తకముల రచయిత కూడ. జమాఅత్‌తో వీరికి దగ్గరి సంబంధము గలదు. 2012లో యూరోపియన్ పార్లమెంట్‌లో జరిగిన వేడుకలో కూడ వీరు వచ్చియుండిరి. నాతో కలిసిరి. వీరిట్లనిరి. సర్వధర్మ సమ్మేళనమైన ఈ కాన్ఫరెన్స్ గురించి నా అభిప్రాయాలు, భావాలను వ్యక్తపరచసాగినచో ఈ కాన్ఫరెన్స్ ప్రధాన్యత, అహ్మదియ్య ముస్లిం జమాఅత్ ప్రాముఖ్యతను తెలుపుటలో అనేక పుటలు నిండిపోవును. ప్రపంచ చరిత్రలో వివిధ ధర్మములు కలహాలకు కారణమైనవి. నేడు కూడ వివిధ ఆచారాలు, తూర్పు, పడమర, ఇస్లాం, క్రైస్తవ, అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుచున్న దేశాల మధ్య విభేదము గలదు. ద్వేషము, దౌర్జన్యమును పెంచుటకు ఈ విభేదమును సాకుగా చూపబడును. కాని 'ప్రేమించు అందరిని ద్వేషించకు ఎవ్వరిని' అను అహ్మదియ్య ముస్లిం జమాఅత్ నినాదము సర్వమతాల సారాంశము. ఈ నినాదము అన్ని మాతాల వారందరిని తమ విశ్వాసాలు, స్థితులు, ఆలోచనాల కతీతంగా ఏకము చేయును. ముస్లిముల ఒక వర్గము యుద్ధము, ద్వేషము, హింస, ఇతరుల జీవితములను ఆపదలో పడవేయు, తమ వారిపైనే దాడులు చేయుటను బలపరచుచున్న సమయంలో అహ్మదియ్య జమాఅత్ ఈ పాత్ర చాలా కీలకమైనది. కావున ఇటువంటి వేడుకలకు అంతర్జాతీయ స్థాయిలో ధార్మిక, అభిప్రాయల కమ్యూనిటీల ద్వారా ప్రోత్సాహము లభించవలెను.

**పేద్రూఆబాద్ నుండి Miguel Garcia** గారు కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీరు మేయర్‌గా కూడ యుండిరి. వీరు తమ కాలములో చర్చి వ్యతిరేకించినను 1980లో మస్జిద్ బషారత్ నిర్మించుటకు అనుమతించిరి. మస్జిద్ బషారత్ ప్రారంభోత్సవము సందర్భమున హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబెతో కలిసిరి. వారు వీరికి కలిమాతో నున్న ఒక ఫ్రేమ్ కానుకగా ఇచ్చిరి. దానిని వీరు తన కార్యాలయములో పెట్టిరి. జమాఅత్‌తో చాలా ప్రభావితమై యున్నారు. వీరిట్లనిరి. ఐక్యత, శాంతి స్థాపన అవసరమును సంభాషణ ద్వారా గ్రహించవలెనని అహ్మదియ్య ముస్లిం జమాఅత్ తరపున వివిధ ధర్మముల బృందాలు, పార్లమెంట్ సభ్యులు, రాజకీయ ప్రముఖులు, విద్యావేత్తలు, మానవ సేవకు సంబంధించిన సంస్థల ప్రతినిధులను లండన్‌లో ప్రోగు చేయబడెను. ఇదొక సానుకూల చర్య. ఈ వేడుకను నిర్వహించినందుకు నేను జమాఅత్‌కు శుభాకాంక్షలు తెలుపుచున్నాను. ఈ జమాఅత్ తన ఉద్దేశాలను పొందుటలో సఫలము కావలెనని నేను ఆశించుచున్నాను. నాకు గర్వ కారణమేమనగా అహ్మదియ్య జమాఅత్ మూడవ ఖలీఫాను పేద్రూఆబాద్‌లో మస్జిద్ బషారత్ శంకుస్థాపన సందర్భముగా కలిసే అనుగ్రహము

1981లో లభించెను. ఆ తర్వాత 1982 లో ప్రారంభోత్సవమున నాలుగవ ఖలీఫాతో కలిసే భాగ్యము కలిగెను. ఇప్పుడు ఈ కాన్ఫరెన్స్ ద్వారా అహ్మదియ్య జమాఅత్ ఐదవ ఖలీఫాతో కలిసే అనుగ్రహము లభించినది. నేను హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ గారి మాటలతో ఉత్తేజితుడనైతిని. వారు యుద్ధము, జగడముల కతీతంగా ఒక శాంతియుత సమాజ స్థాపన గురించి మాట్లాడిరి. ఆత్మరక్షణ మాటున మానవులపై ఆయుధాలకు ప్రాధాన్యతనిచ్చు ప్రభుత్వాలను ఖండించిరి. మిర్జా మస్రూర్ అహ్మద్ న్యాయము, పరస్పర గౌరవము లాంటి సమాజ స్థాపన కొరకు వివిధ ధర్మముల ప్రజలను ఒక చోట చేర్చినందుకు నాకు సంతోషము కలిగెను. ప్రతికూలతతో నిండివున్న సమాజములో మనమున్నాము. కొన్ని దేశాలు ప్రగతి అత్యున్నత స్థాయికి చేరుకోగా ఒక పెద్ద సంఖ్య ఆకలితో మరణించుచున్నది. ఒక వైపు లక్షలాది టన్నుల ఆహారము మనము సముద్రములో పడవేయగా రెండవ వైపు కోట్లాది ప్రజలకు అతి కష్టముగా తినుటకు కొంచెం అభించును. ఒక వైపు కోట్లు గల వారి సంఖ్య పెరుగుచున్నది. రెండవ వైపు సమాజములో కొన్ని వర్గాలు కఠిన బీదరికములో నున్నవి. యుద్ధమును అంతము చేయు, శాంతిని ఆశించు ప్రపంచ అవసరము గలదు. అది అందరిని కలుపుకొని సంయుక్తముగా అన్యాయముకు వ్యతిరేకముగా నిలబడి న్యాయ స్థాపనకు కృషి చేయును.

ఈ కొన్ని సమీక్షలను నేను ప్రస్తావించితిని. ప్రపంచము తనను పుట్టించిన వాని వైపు దృష్టి సారించి, అతన్ని గుర్తించేటట్లు అల్లాహ్ చేయుగాక! అల్లాహ్‌ను గుర్తించితేనే మన ముందు నిలిచి వున్న వినాశనము నుండి రక్షింపబడును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తన గ్రంధములో తన వ్రాతలలో అనేక సార్లు దీని గురించి హెచ్చరించిరి.

నేడు నేను మరల పాకిస్తాన్ పరిస్థితుల గురించి ప్రార్థనకు చెప్పదలచితిని. దుష్టుల నుండి ఈ దేశమును అల్లాహ్ రక్షించుటకు, అహ్మదీయులను కాపాడుటకు, ఈ పీడనములో భాగము కాక రక్షణ, శాంతిని కోరువారందరు సురక్షితముగా నుండుటకు ప్రార్థన చేయగలరు. సీరియా స్థితుల గురించి కూడ ప్రార్థన చేయగలరు. అక్కడ కూడ అహ్మదీయులను అల్లాహ్ సురక్షితముగా వుంచుగాక! అకారణముగా గత కొద్ది రోజుల క్రితం ఒక అహ్మదీయున్ని బంధించబడెను. అల్లాహ్ అహ్మదీయులందరిని రక్షించుగాక! సామాన్యముగా ప్రపంచము మొత్తము కొరకు కూడ ప్రార్థన చేయగలరు. యుద్ధము వైపు చాలా వేగముగా వెళ్ళుచున్నారని అనిపించుచున్నది. కొన్ని పెద్ద ప్రభుత్వాలు యుద్ధము జరిగినచో ఎంతటి భయానక స్థితి ఏర్పడునో అను విషయమును అర్థం చేసుకోవడం లేదు. ప్రపంచము వినాశనపు అంచున నిలిచియున్నది. వీరందరి కొరకు ప్రార్థన చేయుట మన కర్తవ్యము.

✡ ✡ ✡